గ్రంథాలయ చైర్మన్ పదవి రద్దు

తాండూరు, జనవరి 5: రాష్ట్రంలో 33 గ్రంథాలయ చైర్మన్ల పాలకవర్గాలను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వం నియమించిన పాలక వర్గాలను రద్దు చేస్తూ లైబ్రరీస్ యాక్ట్ 1960 తక్షణం అమల్లోకి వచ్చే విధంగా ఆదేశాలు జారీ చేశారు. వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా రాజుగౌడ్ గత ఏడాది అక్టోబర్‌లో బాధ్యతలు చేపట్టి పదవికాలం 14నెలలు పూర్తి చేశారు. నామినేటెడ్ పదవులతో పాటు నాన్ అఫిషియల్ పదవులను కూడా రద్దు చేసింది.



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ సాక్షిగా తాండూరు నేతల మధ్య మరోమారు మాటల తూటాలు పేలాయి. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగింది. ఈ నేపథ్యంలో తాండూరు నేతల మధ్య విభేధాలు బయటపడ్డాయి. మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఒక దశలో చూసుకుందాం .. తేల్చుకుందాం అంటూ హెచ్చరికలు చేసుకున్నారు. అలాగే ఇతర అసెంబ్లీ నియోజక వర్గాల నేతల్లో విభేదాలు ఉన్నప్పటికీ అవి బయటకు పొక్కలేదు.

బీఆర్‌ఎస్‌లో తాండూరు రచ్చ

తెలంగాణ భవన్ సాక్షిగా మరోసారి భగ్గుమన్న విభేదాలు!

- పట్నం, పైలెట్ మధ్య మాటల యుద్ధం
- మిగతా నియోజకవర్గాల్లో నివురుగప్పిన నిప్పులా...
- చేవెళ్ల పార్లమెంట్ నేతలతో హరీష్ సమావేశం
- అసమ్మతి నేతలకు అందని ఆహ్వానం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/తాండూరు),జనవరి 5: పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న వేళ బీఆర్‌ఎస్‌లో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. తెలంగాణ భవన్ సాక్షిగా నేతల మధ్య మాటలు తూటాలు పేలాయి. నువ్వెంత అంటే నువ్వెంత అనే రీతిలో ఒకరిపై మరొకరు దూసుకెళ్లారు. చూసుకుందాం ...రా... తేల్చుకుందాం రా అంటూ పరస్పరం సవాళ్లు విసురుకున్నారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్‌లో గ్రూపు వివాదాలు భగ్గుమన్నాయి. తాండూరు నేతల మధ్య వివాదాలు మరోసారి బయటపడ్డాయి. మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అలాగే ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల నేతల్లో విభేదాలు ఉన్నప్పటికీ బయటకు పొక్కలేదు. తాండూరు నేతల మధ్య ఘర్షణతో ఇతర నియోజక వర్గ నేతలెవ్వరూ మాట్లడకూడదని కట్టడి చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యేలు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమ వ్యతిరేక వర్గీయులకు సమావేశానికి ఆహ్వానించలేదు. లేదంటే ఇంకా పెద్ద ఎత్తున సమావేశంలో గొడవలు జరిగేవి. వాస్తవానికి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌లో లుకలుకలున్నాయి. గతంలో అధికారంలో ఉండడంతో ఇవి ఎక్కడా పెద్దగా బయటకు పొక్కలేదు. ఒకటి రెండు నియోజకవర్గాల్లో మాత్రం నేతల మధ్య వివాదాలు జరిగాయి. ఎన్నికల అనంతరం బీఆర్‌ఎస్‌లో వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి.

తెలంగాణ భవన్‌లో..

తాజాగా జరిగిన చేవెళ్ల పార్లమెంట్ స్థాయి సమావేశంలో మాజీ మంత్రి ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిల మధ్య వర్గపోరు మళ్లీ బయటపడింది. మాజీ మంత్రులు హరీష్‌రావు, సబితారెడ్డి, సీనియర్ నేతలు కేశవరావు, కడియం శ్రీహరి, మధుసూదనాచారి తదితరులు సమక్షంలో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ సమావేశంలో మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి ప్రసంగిస్తుండగా మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వర్గానికి చెందిన ఇంతియాజ్, శ్రీనివాస్‌చారి అడ్డుకున్నారు. మీరు ,మీ భార్య సునీతారెడ్డి కలిసి రోహిత్‌రెడ్డిని ఓడించారని, కుట్రకు తెరలేపి పార్టీని బ్రష్టు పట్టించారంటూ మహేందర్‌రెడ్డి ప్రసంగాన్ని అడ్డుకున్నారు. వేదికపై ఉన్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కూడా మహేందర్‌రెడ్డిపై ఆగ్రహంతో ఊగిపోయారు. మహేందర్‌రెడ్డి సైతం రోహిత్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. ఒక దశలో ఇద్దరు కూడా చూసుకుందాం అంటే తేల్చుకుందాం.. అంటూ పరస్పరం హెచ్చరికలు చేసుకున్నారు. మహేందర్‌రెడ్డి సోదరుడు కుమారుడు షాబాద్ జడ్పీటీసీ అవినాష్‌రెడ్డి వేదికపైన రోహిత్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. ఇరువర్గాలకు మాజీ మంత్రి హరీష్‌రావు సర్ధి చెప్పారు. ఇలాగైతే బయటికి చెడు సంకేతాలు వెళతాయని హరీష్‌రావు ఇరువర్గాలను వారించారు. ఎన్నికల ముందు పార్టీ ఆదేశాల మేరకు మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వర్గ విభేదాలన్నీ పక్కన పెట్టి మళ్లీ కలిసి పోయారు. రోహిత్‌రెడ్డి తనకు టికెట్ ప్రకటించగానే ముందుగా మహేందర్‌రెడ్డి ఇంటికి వెళ్లి స్వీట్లు తినిపించారు ఇద్దరు కలిసి పోవడంతో కార్యకర్తలు, బీఆర్‌ఎస్ శ్రేణులు సంబరపడ్డారు. ఎన్నికల సమయంలో ఇద్దరు కలిసి ప్రచారం చేసినప్పటికీ వారి మనస్సులు మాత్రం కలవలేదు. ఎక్కువగా ఎడమోహం పెడమోహంగానే ఉన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలకు ముందు పార్టీలో బయటపడుతున్న లుకలుకలు విజయవకాశాలను దెబ్బతీస్తాయని పార్టీ ముఖ్యనేతలు ఆందోళనతో ఉన్నారు. ఇప్పటికే చేవెళ్ల పార్లమెంట్ టిక్కెట్ మళ్లీ సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. ఈ విషయాన్ని రంజిత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. అయితే ఇప్పుడు నేతల మధ్య బయటపడుతున్న విభేదాలు పార్టీ నాయకత్వాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. తాండూరు కాకుండా మిగతా అన్ని నియోజకవర్గాల్లో కూడా నేతల మధ్య విభేదాలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. ఇప్పటికే నగర శివార్లకు చెందిన కొందరు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ వైపు వెళ్లేందుకు మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. సిట్టింగ్ ఎమ్మెల్యేలతో కొందరు నేతలకు అసలు పొసగడం లేదు. వీరంతా ఇప్పుడు కాంగ్రెస్ వైపు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

వారించిన హరీష్‌రావు


మర్పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లు

ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ ఆధ్వర్యంలో..

నేడు ముత్యాల ముగ్గుల పోటీలు



- వికారాబాద్ జిల్లా మర్పల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాల అవరణలో పోటీలు
- మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లోని గురుకుల మైదానంలో ఏర్పాట్లు పూర్తి

వికారాబాద్/ జనవరి5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి -ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన ఆధ్వర్యంలో ఈనెల 6వతేదీ వికారాబాద్ జిల్లా, మర్పల్లి మండల కేంద్రంలో ముత్యాల ముగ్గుల పోటీలు జరగనున్నాయి. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఉదయం 9 గంటలకు ముత్యాల ముగ్గుల పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీలకు స్పాన్సరర్లుగా స్వప్న సురేష్, పట్లూర్ ఎంపీటీసీ, సూర్యోదయ రియల్ ఏస్టేట్, అక్షర అర్వో ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్, ప్రొప్రైటర్ పి.అశోక్, మల్లికార్జునగిరి గ్రామం, డి.శేషుపాల్‌సింగ్, దత్తసాయి కన్‌స్ట్రక్షన్స్ వ్యవహరిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే మహిళలు, యువతులు సకాలంలో మైదానికి చేరుకోవాలి.

మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ గురుకుల్ మైదానంలో..

మేడ్చల్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు...పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగుళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన ఆధ్వర్యంలో శనివారం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ గురుకుల్ మైదానంలో జరుగనున్నాయి. గురుకుల్ మైదానంలో నేడు ఉదయం 10 గంటలకు ముత్యాల ముగ్గుల పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీలకు స్పాన్సర్లుగా ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్యయాదవ్ వ్యవహరిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే మహిళలు, యువతులు సకాలంలో గ్రౌండ్ వద్దకు చేరుకోవాలి. కార్యక్రమంలో ముఖ్య అతిధిలుగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డిలు హాజరుకానున్నారు. ముత్యాలముగ్గుల పోటీలకు గురుకుల్ మైదానాన్ని అందంగా తీర్చిదిద్దారు.

కాగా, ఆయా జిల్లాల పరిధిలోని సెంటర్లలో జరిగే ముగ్గుల పోటీల్లో వేర్వేరుగా మొదటి మూడు స్థానాల్లో నిలిచే వారికి నగదు బహుమతులు అందజేస్తారు. ప్రథమ బహుమతి రూ.6 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతి రూ.3వేలతో పాటు ఈ పోటీల్లో పాల్గొనే వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నారు.


ముగ్గుల పోటీలకు సిద్ధమైన ఘట్‌కేసర్‌లో గురుకుల్ గ్రౌండ్

రోడ్డు ప్రమాదాలు తగ్గించాలి

జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి

వికారాబాద్, జనవరి 5: జిల్లాలో రోడ్డు ప్రమాదాల కేసులు తగ్గించాలని ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా తనిఖీల్లో భాగంగా ఎస్పీ శుక్రవారం డిస్ట్రిక్ట్ క్రైం రికార్డ్స్ బ్యూరో వింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. డీసీఆర్‌బీ వింగ్ కి సంబంధించిన ఫైల్స్, రికార్డ్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డీసీఆర్‌బీ ఒక ముఖ్యమైన విభాగం, ఇందులో పని చేసి అధికారులు ఎప్పటికప్పుడు సమాచారాన్ని నవీకరణ చేసుకోవాలి. పోలీస్ స్టేషన్లలో క్రైం, దొంగతనాలు, ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాదాలను నియంత్రించడానికి పోలీస్ అధికారులు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ చలాన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య , డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశం, ఎస్‌ఐలు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి


సదస్సును ప్రారంభిస్తున్న వీసీలు, ప్రొఫెసర్లు

పారదర్శకంగా కార్పొరేట్ వ్యవహారాలు

సీసీజీఆర్‌టీ చైర్మన్ సీఎస్‌ఆర్ వెంకటరమణ

శామీర్‌పేట, జనవరి5 : కార్పొరేట్ వ్యవహారాలు పారదర్శకంగా, ప్రజానుకూలంగా సాగాలని సీసీ జీఆర్‌టీ చైర్మన్ సీఎస్ ఆర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం శామీర్‌పేటలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కృష్ణదేవరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ కార్పొరేట్ గవర్నెన్స్ రీసెర్చ్, కార్పొరేట్ లాస్ అండ్ గవర్నెన్స్‌లో డెవలప్‌మెంట్స్ అండ్ ట్రెండ్స్ అనే అంశంపై మూడు రోజుల జాతీయ సదస్సు, సీసీజీఆర్‌టీ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేట్ వ్యవహారాల్లో సామాజిక చట్టాలు సజావుగా సాగాలని వివరించారు. ఎన్‌ఎల్‌యూ జోద్‌పూర్ వైస్‌ఛాన్సలర్, ప్రొఫెసర్ హర్‌ప్రీత్ కౌర్ కార్పొరేట్ వ్యవహారాలు, సామాజిక చట్టాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పలు న్యాయ విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు చెందిన అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ఇస్తేమా సభల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జనవరి5: పరిగి మునిసిపల్ పరిధిలోని న్యామత్‌నగర్‌లో 6,7.8తేదీల్లో నిర్వహిస్తున్న సుబాయి దీని ఇజ్‌తెమ (ఇస్తేమా) సభల ఏర్పాట్లను పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, టీపీసీసీ అధికారి ప్రతినిధి ఫిరోజ్‌ఖాన్ శుక్రవారం పరిశీలించారు. విద్యుత్, మిషన్‌భగీరథ, మునిసిపల్ అధికారులతో మాట్లాడారు. మూడు రోజుల పాటు జరిగే సభలకు అన్ని ఏర్పాట్లను దగ్గరుండి చూడాలని అధికారులకు సూచించారు. నీటిసరఫరా, విద్యుత్ సరఫరాతో పాటు భోజనాలపై పర్యవేక్షణ ఉండాలన్నారు. వాహనాలకు కేటాయించిన స్థలాల్లోనే పార్కింగ్ చేసే విధంగా చూడాలని సూచించారు. పోలీస్ కంట్రోల్ రూం నుంచి బందోబస్తుతో పాటు, నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు వాజిద్, సాహేద్ తదితరులు ఉన్నారు.

డాటా ఎంట్రీలో తప్పులు దొర్లొద్దు

» జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 5: ప్రజాపాలనలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల వివరాలను ఎలాంటి తప్పులు దొరలకుండా వెబ్‌సైట్ లో నమోదు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కంప్యూటర్ ఆపరేటర్లకు ప్రజాపాలన దరఖాస్తుల డాటాఎంట్రీ నమోదుపై ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రజా పాలన దరఖాస్తులను వెబ్‌సైట్ లో నమోదు చేసేందుకు 57 టీంలను ఏర్పాటుచేయడం జరిగిందని, ప్రతి టీంలో 20 మంది కంప్యూటర్ ఆపరేటర్లు ఉంటారన్నారు. అన్ని మండల కేంద్రాలలో సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతిరోజు రెండు షిఫ్టులలో 10 మంది చొప్పున డాటా ఎంట్రీ చేయాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా పనులు చేపట్టాలని, ఒక్క టీం ప్రతి రోజు వేయి దరఖాస్తులను అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులన్నింటినీ ఈనెల 17 వరకు పూర్తి చేయాలని సూచించారు. ఆధార్, రేషన్‌కార్డు, సెల్ నంబర్లను పూర్తి జాగ్రత్తతో తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. దరఖాస్తు నమోదు చేసిన తర్వాత వచ్చే యూనిక్ నంబర్‌ను రెడ్ పెన్నుతో దరఖాస్తు పై భాగంల రాసి పై దరఖాస్తు చివరి భాగంలో ఎంట్రీ చేసిన ఆపరేటర్ పేరు సంతకం చేయాలని సూచించారు. ఈ డాటా ఆధారంగానే లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం డాటా ఎంట్రీ ఆపరేటర్ల సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, డీపీవో తరుణ్‌కుమార్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి


అక్రమంగా నిల్వ ఉంచిన సిలిండర్లతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

అక్రమంగా నిల్వ ఉంచిన డొమెస్టిక్ సిలిండర్ల స్వాధీనం

వికారాబాద్, జనవరి 5: వికారాబాద్‌లో గల కన్య లాల్బాగ్ కాలనీలో కొత్తపల్లి చంద్రారెడ్డి అనే వ్యక్తి ఇంట్లో సబ్సిడీ డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ ఉంచుకొని అధిక ధరకు విక్రయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న వికారాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్, ఆయన బృందం, స్థానిక పోలీసులు ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. 38 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని వికారాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


పరిగి శివారులో ఇజ్తిమా సభలు నిర్వహించే ప్రాంగణం

నేటి నుంచి ఇజ్తిమా సభలు

» పరిగిలో మూడు రోజుల పాటు నిర్వహణ

» 3-5 లక్షల మంది ముస్లింలు వచ్చే చాన్స్

పరిగి, జనవరి 5: తబ్లీగీ జమాత్ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా పరిగిలో నిర్వహించే సుబాఈ దీనీ ఇజ్తిమా సభలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరిగి మునిసిపాలిటీ శివారులోని న్యామత్‌నగర్‌లో మూడు రోజుల పాటు జరిగే ఈ సభలకు 3-5 లక్షల వరకు ముస్లింలు హాజరవ్వుతారని అంచనా వేస్తున్నారు. దాదాపు 300 ఎకరాల స్థలంలో 5 లక్షల మందికిపైగా కూర్చునే విధంగా ఏర్పాట్లు చేశారు. తెలంగాణ, ఏపీ, కర్ణాటకృతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల వారు హాజరు కానున్నారు. భోజన వసృతుల కోసం ప్రత్యేకంగా 26 వంట శాలలను ఏర్పాటు చేశారు. నీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలలను కూడా ఏర్పాటు చేశారు. ఇజ్తిమా నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.2.45 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారు జిల్లాలు, ప్రాంతాల వారీగా కూర్చూనే విధంగా బోర్డులు ఏర్పాటు చేశారు. పార్కింగ్ కోసం వంద ఎకరాల వరకు జిల్లాల వారీగా ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం నుంచే ఇజ్తిమా సభల కోసం జనం తరలివస్తున్నారు. ఎస్పీ కోటిరెడ్డి పర్యవేక్షణలో భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్లపై అవిశ్వాసం?

కలెక్టర్‌కు తీర్మానపత్రం సమర్పించిన అధికార, ప్రతిపక్ష సభ్యులు ● కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల మద్దతు


కొత్త ఆర్థీక, చైర్‌పర్సన్


కలెక్టర్ కార్యాలయంలో పిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ బీఆర్ఎస్ సభ్యులు

ఆదిభట్ల, జనవరి 5 : ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్ల మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమైందా..? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్‌పర్సన్లపై అవిశ్వాసం దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. చైర్‌పర్సన్ కొత్త ఆర్థీక, వైస్ చైర్‌పర్సన్ కోరే కళమ్మలపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టాలంటూ శుక్రవారం ఆదిభట్ల మున్సిపాలిటీ కౌన్సిలర్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అధికార కాంగ్రెస్‌తోపాటు బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు సైతం మద్దతు ప్రకటించడంతో అవిశ్వాసం తీర్మానం ఖరారైనట్లు తెలుస్తోంది. కొత్తగా ఏర్పాటుచేసిన ఆదిభట్ల మున్సిపాలిటీకి జరిగిన ఎన్నికల్లో మొత్తం 15 మంది సభ్యులకు గాను కాంగ్రెస్ నుంచి ఎనిమిది మంది, బీఆర్ఎస్ నుంచి ఆరుగురు సభ్యులు బీజేపీ నుంచి ఒక సభ్యుడు గెలిచారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎనిమిది మందితో పాటు బీజేపీకి చెందిన మరో సభ్యుడు మద్దతు ప్రకటించినప్పటికీ కాంగ్రెస్ నుంచి ఎంపికైన కొత్త ఆర్థీకను నాటి అధికార టీఆర్ఎస్ పార్టీలోకి తీసుకొని ఎక్స్ అఫీషియో సభ్యుల సహకారంతో చైర్‌పర్సన్‌ను చేసింది. అప్పటి నుంచి మున్సిపాలిటీలో ఆధిపత్య పోరు నిత్యం జరుగుతూనే ఉంది. గతంలో జరిగిన పరిణామాలతో చైర్‌పర్సన్ ఆర్థీక బీఆర్ఎస్‌ని వీడి మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరారు. చైర్‌పర్సన్ భర్త, కుటుంబ సభ్యులు అన్ని విషయాల్లో జోక్యం చేసుకుంటుండడం, కాంగ్రెస్‌లో చేరినప్పటికీ ఆ పార్టీ కార్యకర్తలతో గానీ ఇతర సభ్యులతో గానీ సఖ్యతగా మెలగలేకపోవడం, అటు బీఆర్ఎస్‌లో ఇమడలేక మళ్లీ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నప్పటికీ పార్టీకి దగ్గర కాలేకపోయింది. బీఆర్ఎస్ అధికారం కోల్పోయి కాంగ్రెస్ అధికారంలోకి రావడం, స్థానికంగా పార్టీ ఎమ్మెల్యే ఉండటంతో పార్టీ నుంచి చైర్మన్‌ను ఎంపిక చేసే అవకాశాలున్నాయని చెప్పుకోవచ్చు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అవిశ్వాసం లాంఛనమే అని తేలిపోయింది.

కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు క్షమించరు



మేడ్చల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తొమ్మిదన్నరేళ్లుగా రాష్ట్రాన్ని దోచుకున్న కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ క్షమించరని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కల్తీ పాలవలే నియోజకవర్గాన్ని కల్తీమయం చేస్తున్న మల్లారెడ్డిపై దమ్ముంటే కేటీఆర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హామీలను 420 హామీలని కేటీఆర్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చి నెల రోజులు కూడా పూర్తి కాకుండానే కేటీఆర్ విమర్శలు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రజలు కర్రు కాల్చి వాతలు పెట్టినా ఇంకా బుద్ధి రాలేదని విమర్శించారు. మాజీ మంత్రి మల్లారెడ్డి చెరువు స్థలాలు కబ్జాలు చేస్తూ అవినీతిమయం చేశాడని, మున్సిపల్ ఎన్నికల్లో రూ.500 కోట్లు టికెట్లు అమ్ముకున్నాడని ఆయన ఆరోపించాడు. ఆయన అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చి ప్రజల ముందు నిరూపిస్తామన్నారు.


కొర్రెముల జిల్లా పాఠశాలలో నిర్వహించిన కెరీర్ గైడెన్స్ పాల్గొన్న అనురాగ్ యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు

విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 5: విద్యార్థులు పాఠశాల స్థాయినుంచే క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని అనురాగ్ యూనివర్సిటీ ప్రోగ్రాం ఆఫీసర్ మధుకర్ తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కొర్రెముల జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్ వంటి పోటీపరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ అధ్యాపకులు తృప్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, హెచ్ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మతి తప్పి మాట్లాడుతున్న సబితారెడ్డి

» డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



రంగారెడ్డి అర్బన్, జనవరి 5 : మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మతి తప్పి మాట్లాడుతున్నారని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి కనీసం నెల కూడా కాలేదని, అప్పుడే కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం ఎక్కడ? అని సబితారెడ్డి ప్రశ్నించడం చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుందన్నారు. ఐదేళ్ల పాలనలో నువ్వు ఇస్తా అన్న దళిత బంధు, బీసీ బంధు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, కేజీ టూ పీజీ ఎక్కడ? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని, ఇప్పటికే ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. సబితారెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేసేముందు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల గురించి ఒక్కసారి ఆలోచించి మాట్లాడాలని చల్లా తెలిపారు.

మహేశ్వరం నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ కమిటీలన్నీ రద్దు

మహేశ్వరం, జనవరి 5 : మహేశ్వరం నియోజకవర్గంలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ డివిజన్‌లలోని తమ పార్టీ కమిటీలను రద్దు చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం రాష్ట్ర పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సూచన మేరకు మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీకి సంబంధించిన అన్ని కమిటీలను తక్షణమే రద్దు చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ అనుమతి లేకుండా ఎవరైనా నేను ఫలానా అధ్యక్షున్ని అని ప్రచారం చేసుకునే వ్యక్తులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని అన్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశానుసారం పార్టీ కోసం పనిచేసేవారిని గుర్తించి త్వరలో తగిన ప్రాధాన్యతనిస్తూ కమిటీలు వేస్తామని ప్రకటించారు





కోర్టు ఆదేశాలతో రోడ్డుపై కంకర తొలగింపు


చెంగోల్‌లో బైపాస్ రోడ్డుపై వేసిన కంకరను తొలగించాలని డీఈ శ్రీనివాస్‌ను కోరుతున్న నయీంఅక్తర్

తాండూరు రూరల్, జనవరి 5: మండలంలోని చెంగోల్ గ్రామ శివారులో కొనసాగుతున్న బైపాస్ రోడ్డు పనులపై ఓ రైతు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. కంకరను తొలగించేలా డీఈ శ్రీనివాస్‌ను కోరారు. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం రోడ్డుపై వేసిన కంకరను జేసీబీ సాయంతో తొలగించారు. భూయజమాని హబీబ్ సుల్తానా, ఆమె భర్త నయీంఅక్తర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెంగోల్ గ్రామ శివారులోని సర్వేనెంబర్-250, 248లో తమకు 24గుంటల పట్టా భూమి ఉందని తెలిపారు. ఇట్టి భూమిలో నుంచి బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం ఆర్అండ్‌బీ అధికారులు తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే భూమిలో నుంచి రోడ్డు వేశారు. దీంతో అప్పట్లో అట్టి భూమిలో ఉన్న పాలిషింగ్ యూనిట్లను తొలగించడంతో పెద్ద ఎత్తున నష్టపోయినట్లు తెలిపారు. అయితే ఇట్టి విషయంపై రోడ్డును తొలగించాలని అధికారులను కోరినప్పటికీ పట్టించుకోలేదు. తమ భూమి నష్టపోతున్నామని 2023, ఆగస్టు లో న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు వారు తెలిపారు. తమకు న్యాయస్థానం అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో అట్టి రోడ్డును తాండూరు ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్ జేసీబీ సాయంతో శుక్రవార ం తొలగించారు. అయితే 2017లో తమ భూమిలో ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండానే రోడ్డు వేశారని, దీంతో తాము కోర్టును ఆశ్రయించినట్లు బాధితులు తెలిపారు. 2017లో రోడ్డు వేయడం వల్ల పాలిషింగ్ మా భూమిలో ఉన్న పాలిషింగ్ యూనిట్లకు భారీగా నష్టం జరిగిందని వాపోయారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు తమ పొలం పక్క నుంచి అలైమెంట్ మార్చి రోడ్డు వేస్తే బాగుంటుందని కోరారు. ఈ విషయంపై తాండూరు ఆర్అండ్‌బీ డీఈ క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించారు. బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం 24గుంటల భూమిని తీసుకున్నది వాస్తవమేనని, అయితే బ్యాంకు అకౌంట్లు ఇవ్వకపోవడం, భూమికి సంబంధించిన సమగ్ర వివరాలు ఇవ్వకపోవడంతో వారికి పరిహారం అందలేదన్నారు. కొంతమందికి భూ వివరాలు సరిగ్గా లేనందున పరిహారం డబ్బులు ఇవ్వాల్సి ఉందని, త్వరలోనే వారందరికీ క్లీయర్ చేస్తామని వివరించారు.







ఓటరు లిస్టులో పేర్లు నమోదు చేయించుకోవాలి

» చేవెళ్ల ఆర్డీవో సాయిరాం



చేవెళ్ల, జనవరి 5 : 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా పేరు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని చేవెళ్ల ఆర్డీవో సాయిరాం తెలిపారు. శుక్రవారం చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు జనవరి 6వతేదీ నుంచి 22వతేది వరకు ఓటరు లిస్టుల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులకు అవకాశం ఉందన్నారు. కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలనుకునే వారు ఆన్‌లైన్‌లోగాని, తహసీల్దార్ కార్యలయంలోగానీ, ఆర్డీవో కార్యాలంలోగానీ ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 8న ఓటర్ల తుది జాబితా విడుదల చేస్తామన్నారు. రాబోయే పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఇదే ఓటరు లిస్టు పరిగణలోకి వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

కమ్యూనిటీ ఆస్పత్రికి కేంద్ర ప్రభుత్వ గుర్తింపు


డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

షాద్‌నగర్, జనవరి 5 : కమ్యూనిటీ ఆస్పత్రికి కేంద్ర ప్రభుత్వ గుర్తింపు లభించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గత ఏడాది నవంబర్‌లో నేషనల్ హెల్త్ సిస్టమ్ రిసోర్స్ సెంటర్ వైద్య బృందం కమ్యూనిటీ ఆస్పత్రిని సందర్శించింది. కమ్యూనిటీ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఏడు విభాగాల్లో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించింది. రోగులకు నాణ్యమైన వైద్య సేవలనందిస్తుంన్నందుకు కమ్యూనిటీ ఆసుపత్రికి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్ (ఎన్ క్యూఎస్) సర్టిఫికెట్‌ను ప్రదానం చేసింది. ఈ సర్టిఫికెట్ మూడేళ్ల పాటు ఆస్పత్రికి వర్తించడంతో పాటు, ఏడాదికి రూ. 5లక్షలు కేంద్రం నుంచి కేటాయిస్తారని డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తమ వైద్య సిబ్బంది అందిస్తున్న నిరంతర సేవలకు సర్టిఫికెట్ రావడం హర్షణీయమన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట


పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట, జనవరి 5 : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కేశంపేట మండల కేంద్రంలో రూ. 77లక్షలతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు విద్యా శాఖ అధికారులతో చర్చిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'గ్యారంటీ'లు అందేలా చూస్తాం

● పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


పరిగి: సుల్తాన్‌పూర్‌లో ప్రజాపాలన సభలో మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


యాలాల: ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పరిగి, జనవరి 5: అర్హులైన పేదలందరికీ ఆరు గ్యారంటీ పథకాలు అందేలా చూస్తామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలనలో భాగంగా శుక్రవారం మండలంలోని సుల్తాన్‌పూర్‌లో దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం కాళ్లాపూర్ గ్రామంలో పంచాయితీ భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జడ్పీటీసీ బి.హరిప్రియప్రవీన్‌రెడ్డి, ఎంపీటీసీలు వెంకట్రాంరెడ్డి, ఉమాదేవి, సర్పంచ్‌లు పి.పద్మమ్మ, జంగయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణప్రసాద్, కె.హన్మంత్, పార్టీ మండల అధ్యక్షుడు బి.పరుశరాంరెడ్డి, నార్మాక్స్ డైరెక్టర్ వెంకట్‌రాంరెడ్డి, తావుర్యానాయక్ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: మండలంలోని రుద్రారం, పాటిమీదిపల్లి గ్రామాల్లో అధికారులు ప్రజాపాలన సదస్సులు నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారుల నుంచి ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్ దరఖాస్తులను స్వీకరించారు. అదేవిధంగా పాటిమీదిపల్లి గ్రామంలో మండల ప్రత్యేకాధికారి స్టీవెన్ నీల్ పాల్గొని దరఖాస్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.విజయ్‌కుమార్, సర్పంచ్ వెంకటలక్ష్మీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దోమ: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో మొత్తం 1100మంది లబ్ధిదారులు ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజు, గౌస్ పాల్గొన్నారు.

దౌల్తాబాద్: నీటూర్, నర్సాపూర్, కౌడీడ్, బిచ్చాల్ గ్రామాల్లో అధికారులు ప్రజాపాలన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: అల్లిఖాన్‌పల్లి, ఎన్కేపల్లి, వడిచర్ల గ్రామాల్లో తహసీల్దార్లు వెంకటేశ్, దానయ్య, ఎంపీడీవో వెంకన్నగౌడ్, ఆర్ఐ రవినాయక్, రవి తదితరులు ప్రజాపాలన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. దరఖాస్తులను పకడ్బందీగా పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఏవో తిప్పేస్వామి అన్నారు. ఆయన బొంరాస్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో డాటా ఎంట్రీ ఆపరేటర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి ప్రజాపాలన దరఖాస్తుల నమోదుపై అవగాహన కల్పించారు.

తాండూరు: అవినీతికి ఆస్కారం లేకుండా ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరులోని 30, 31వార్డుల్లో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలనలో దరఖాస్తులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, బంటారం లావణ్య, ప్రత్యేకాధికారి వినయ్, నాయకులు డాక్టర్ సంపత్, రవుఫ్ పాల్గొన్నారు.

తాండూరు రూరల్: ప్రజాపాలనలో అర్హులందరి దరఖాస్తులను స్వీకరిస్తామని జిల్లా ఉద్యానవన శాఖ, తాండూరు మండల ప్రత్యేకాధికారి చక్రపాణి, ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్ అన్నారు. మండలంలోని ఎల్మకన్నె, సిరిగిరిపేట్, ఉద్దండాపూర్, గుండ్లమడుగుతండా ప్రజాపాలనలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా దరఖాస్తు చేసుకోవడానికి మిగిలిఉంటే శనివారం(నేడు) ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు అందించాలని కోరారు. సిరిగిరిపేట్‌లో 828, ఎల్మకన్నెలో 608, గుండ్లమడుగు తండాలో 230, ఉద్దండాపూర్‌లో దరఖాస్తులు వచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్‌లు వీరమణి, రాధిక, సావిత్రిబాయి, దశరథ్‌జాదవ్, ఎంపీటీసీ సుశీలమ్మ, పత్తిబాయి, రతన్‌సింగ్, వ్యవసాయాధికారి రజిత పాల్గొన్నారు.

యాలాల: ప్రజాపాలనలో ప్రతీఒక్కరి దరఖాస్తులను స్వీకరిస్తామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో తాండూరు నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, తహసీల్దార్ మునిరుద్దీన్, ఎంపీడీవో పుష్పలీల, నాయకులు అక్బర్‌బాబా, రాజేందర్‌రెడ్డి, ధారాసింగ్, నర్సిరెడ్డి, షైను, జిలానిహన్మంత్ పాల్గొన్నారు.

కోట్‌పల్లి: మండలంలోని లింగంపల్లిలో నిర్వహించిన అభయ హస్తం ఆరు గ్యారెంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు విజయలక్ష్మి, అధికారులు, నాయకులు బందెయ్య, అంజయ్య, రాంరెడ్డి, మల్‌రెడ్డి, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధారూరు: ప్రజాపాలన గ్రామ సభలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. మండలంలోని మైలారం, కుమ్మర్‌పల్లి, చింతకుంట, హరిదాసుపల్లి గ్రామాలలో శుక్రవారం అధికారులు ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామ సభలకు ఆయా గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి ఆరు గ్యారంటీల మంజూరు కోసం దరఖాస్తులను అధికారులకు అందజేశారు. నాలుగు గ్రామాల్లో 1050 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భువనేశ్వర్, ఎంపీడీవో చెన్నారెడ్డి పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో తహసీల్దార్ మనోహర చక్రవర్తి, ఎంపీడీవో శైలజారెడ్డి ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటుచేసి టీంల వారీగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదును ప్రారంభించారు.

మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్ రాములు ప్రజల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల పథకాలకు ఎంపిక చేస్తారన్నారు. దరఖాస్తు ఫారాలు క్షుణంగా చదివి అన్ని అంశాలకు సంబంధించిన వివరాలను పొందుపరిచి అధికారులకు సమర్పించాలని కమిషనర్ రాములుకోరారు.

శామీర్‌పేట: గ్రామాల్లో సంబంధిత అధికారులు ప్రజా పాలన కార్యక్రమాన్ని ఏడోరోజు శుక్రవారం కొనసాగించారు. శామీర్‌పేట, అలియాబాద్, లాల్‌గడి మలక్‌పేట, తుర్కపల్లి యాడారం, మురహారిపల్లి, మజీద్‌పూర్, బాబాగూడ, బొమ్మరాశిపేట పొన్నాల్ గ్రామాల్లో దరఖాస్తులను స్వీకరించారు. తూంకుంట మున్సిపల్ పరిధిలో అధికారులు 16 వార్డుల్లో 20 కేంద్రాల్లో అధికారులు అభయహస్తం కౌంటర్లను ఏర్పాటు చేశారు. అభయహస్తం కింద 6065, రేషన్‌కార్డుల కోసం 1852 దరఖాస్తులను స్వీకరించినట్లు కమిషనర్ జైత్రామ్ నాయక్ తెలిపారు.


తాండూరు రూరల్: సిరిగిరిపేట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్


మేడ్చల్ టౌన్: గుండ్లపోచంపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్ రాములు

డేటా ఎంట్రీ పనుల పరిశీలన

వికారాబాద్: ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తుల డేటా ఎంట్రీ పనులను కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. వికారాబాద్ మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం చేపట్టిన డాటా ఎంట్రీ పనులను మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌తో కలిసి పరిశీలించారు. జనవరి 17 వరకు ఇట్టి పనులను పూర్తి చేయాలని సూచించారు.

బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు డుమ్మా

తాండూరు: తాండూరులో వారం పాటు నిర్వహించిన ప్రజాపాలన అధికారిక కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీకి చెందిన మెజార్టీ ప్రజాప్రతినిధులు దూరంగా ఉన్నారు. స్వయంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, అధికారులు పాల్గొన్న కార్యక్రమాలకు బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపీపీ, జడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీటీసీలు దూరంగా ఉన్నారు. పెద్దేముల్ మండలంలో గురువారం నిర్వహించిన ప్రజాపాలనలో ఎమ్మెల్యే పాల్గొనగా ఎంపీపీ అనురాధ హాజరుకాలేదు. యాలాల మండలంలో శుక్రవారం జరిగిన ప్రజాపాలనలో యాలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్త, జడ్పీటీసీ సంధ్యారాణి, సర్పంచ్ డుమ్మాకొట్టారు. తాండూరులో జరుగుతున్న ప్రజాపాలనలో మాత్రం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొన్న కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న హాజరుకాగా, వైస్‌చైర్మన్ దీపా నర్సింహులు మాత్రం హాజరుకాలేదు. బషీరాబాద్ మండలంలో జరిగిన ప్రజాపాలనలో వైస్ఎంపీపీ అన్నపూర్ణ ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొనలేదు. తాండూరు మండలం మాత్రం బీఆర్ఎస్ పార్టీకి చెందిన జడ్పీటీసీ మంజుల, వైస్ ఎంపీపీ స్వరూప పాల్గొన్నారు.

వేదికపైన కాంగ్రెస్ నేతలు

ప్రజాపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు కూర్చోవడంపై విమర్శలకు తావిస్తోంది. అధికారిక కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కాని వారు వేదికపై కూర్చోవద్దని అధికారులు వాదించకపోవడం గమనార్హం. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులను వేదికపై వద్దని చెప్పలేకపోతున్నారు. యాలాల మండల కేంద్రంలో గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి చివరి నిమిషంలో అక్కడ రద్దు చేసి మరోచోట ఏర్పాటు చేయడంతో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే ప్రజాపాలన కార్యక్రమాన్ని బహిష్కరించారు.

500 గ్రాముల గంజాయి పట్టివేత


స్వాధీనం చేసుకున్న గంజాయి, పట్టుబడిన నిందితులు

బంట్వారం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. వారినుంచి 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మండలంలోని బొపునారం బండమీదిపల్లి చెక్‌పోస్టు వద్ద చోటుచేసుకుంది. ఎస్పీ ఎన్.కోటిరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ బొపునారం బండమీదిపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీలు చేపట్టారు. బైక్‌పై ఇద్దరు వ్యక్తులు కర్ణాటక నుంచి తోర్మామిడి వైపు వస్తుండగా తనిఖీ చేశారు. వారి వద్ద 500 గ్రాముల ఎండు గంజాయి పట్టుబడడంతో స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బంట్వారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీలింగ్, అసైన్డ్ భూములు ఆక్రమిస్తే చర్యలు

కీసర, జనవరి 5: ప్రభుత్వ, సీలింగ్, అసైన్డ్ భూములు అక్రమిస్తే చర్యలు తప్పవని కీసర తహసీల్దార్ అశోక్ హెచ్చరించారు. మండలంలోని చీర్యాల్‌లో సర్వే నంబర్ 224/పీలో గల సీలింగ్ భూమిల్లో కొంతమంది రియల్టర్లు 60, 80గజాల చొప్పున లేఔట్ చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు శుక్రవారం భారీ పోలీస్ బందోబస్తుతో వెళ్లి కూల్చివేతలు చేపట్టారు. రియల్టర్ల వద్ద విక్రయించిన జనాలు కూల్చివేతలను అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులు వారి అడ్డుతప్పించి జేసీబీ సాయంతో అధికారులు కూల్చివేతలు జరిపారు. ప్రభుత్వ అసైన్డ్, సీలింగ్ భూములు విక్రయించిన, ఆక్రమించి వ్యాపారం, నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అశోక్ తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు

కొడంగల్ రూరల్, జనవరి 5: మండలంలోని టేకులకోడ్ గ్రామంలో కుక్కలు శుక్రవారం అభిరామ్ అనే బాలుడిపై దాడి చేయడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. దీంతో వెంటనే హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించినట్లు స్థానికులు తెలిపారు. సర్పంచ్ స్పందించి కుక్కలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో 50 నుంచి 60 వరకు ఊర కుక్కలు సంచరిస్తూ తరచూ కోళ్లు, మేకలు, దారివెంట వెళ్లే వారిని కరుస్తున్నాయి. దీంతో చిన్నారులు వీధుల్లోకి వెళ్లాలంటేనే జంకుతున్నారు.

స్వాతంత్ర్య సమర యోధుల కథనాలు స్ఫూర్తి దాయకం

వికారాబాద్, జనవరి 5: స్వాతంత్ర్య సమర యోధుల కథనాలు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్ గత మూడు సంవత్సరాలుగా సేకరించిన స్వాతంత్ర్య పోరాట యోధుల కథనాలను బుధవారం బుక్ రూపంలో రూపొందించి ఆ గ్రంథాన్ని కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌ను అభినందించారు. వీటిని ప్రింట్‌చేసి ప్రతీ పాఠశాలకు ఒకటిచొప్పున పంపేవిధంగా చూడాలని విశ్వేశ్వర్ కలెక్టర్‌ను కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రేణుకదేవి, మద్గుల్ చిట్టంపల్లి ప్రధానోపాధ్యాయులు నరసింహులు పాల్గొన్నారు.

పండిత వ్యవస్థను రద్దు చేయాలి

బంట్వారం (కోట్‌పల్లి) జనవరి 5: పండిత వ్యవస్థను రద్దు చేయాలని శుక్రవారం కోట్‌పల్లి మండల కేంద్రంలో ఆర్‌యూపీపీటీఎస్ సంఘం ఆధ్వర్యంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు మాత్రమే బోధన చేయాలి కానీ దశాబ్దకాలంగా తెలుగు, హిందీ, ఉర్దూ భాషలను లాంగ్వేజ్ పండితులతో బోధన చేయిస్తున్నారని తెలిపారు. నెలకు రూ.150 గౌరవ వేతనం ఇస్తూ వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని వాపోయారు. మిగతా అన్ని సబ్జెక్టులకు పదోన్నతులు కల్పిస్తూ భాషా ఉపాధ్యాయులను మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. సీఎం బాషా పండితుల సమస్యను పరిష్కరించే విధంగా ఆర్డినెన్సు తీసుకువచ్చి, భాషా పండితుల జీవితాల్లో వెలుగు నింపాలని ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మల్లికార్జున్, ప్రచారకార్యదర్శి శ్రీనివాస్, కార్యవర్గసభ్యులు రవి కుమార్, గౌసొద్దిన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

కీసర రూరల్, జనవరి 5: ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ హెచ్చరించారు. నాగారం, రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 84 పార్ట్‌లో 15, దమ్మాయిగూడ మున్సిపాలిటీ కుందన్‌పల్లి రెవెన్యూ సర్వే నంబర్ 152, 153ల్లో 17 అక్రమ నిర్మాణాలను శుక్రవారం ఎక్స్‌కవేటర్ సాయంతో నేలమట్టం చేశారు. కూల్చివేతల సందర్భంగా ఎలాంటి ఉద్రిక్తతలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్తగా భారీగా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు తగుచర్యలు తీసుకుంటామన్నారు. కబ్జాకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఐటీయూలో చేరిన క్యాబ్ డ్రైవర్లు


సీఐటీయూలో చేరుతున్న కార్ డ్రైవర్లు

ఘట్‌కేసర్, జనవరి 5: ఘట్‌కేసర్‌కు చెందిన వంద మంది క్యాబ్ డ్రైవర్లు శుక్రవారం సీఐటీయూలో చేరారు. వారందరికి సీఐటీయూ జిల్లా నాయకులు చింతల యాదయ్య కండువాలు కప్పి సంఘంలోకి చేర్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన రవాణా చట్టం డ్రైవర్ల పాలిట శాపంగా మారిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఎన్. సబిత, నాయకులు బాపిరెడ్డి, గట్టు మైసమ్మ, కార్ ఓనర్స్ మరియు డ్రైవర్స్ యూనియన్ సీఐటీయూ అధ్యక్షుడు రాములు, తోట సమ్మయ్య, రుక్మారెడ్డి, నర్సింహ, కోశాధికారి శివారెడ్డి, శ్రీధర్, కృష్ణగౌడ్, ప్రకాష్, మాధవరెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్, వెంకటేష్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతలతో ర్యాలీ


దోమ: శివారెడ్డిపల్లిలో అయోధ్య రాముడి అక్షింతలతో ర్యాలీ

మేడ్చల్ టౌన్, జనవరి 5: పట్టణంలోని రాఘవేంద్రనగర్ కాలనీలో అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని నర్వహించారు. ఈ సందర్భంగా అక్షింతలతో భక్తులు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. మహిళలు అక్షింతలను మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి, కాలనీవాసులు సాయి కుమార్, ప్రవీణ్, రాంబాబు, రమేష్ పాల్గొన్నారు.

దోమ: శివారెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం అయోధ్య రాముడి అక్షింతలను ఊరేగింపు నిర్వహించి ఇంటింటా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

కులకచర్ల: మండల కేంద్రంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి అక్షింతలను పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్యలోని రామాలయంలో శ్రీరాముడి విగ్రహావిష్కరణ సందర్భంగా ప్రతీ ఇంటిపై కాషాయజెండా ఎగురవేసి అక్షింతలను తలపై చల్లుకోవాలని తెలిపారు. ప్రతీ ఇంట్లో దీపావళి తరహాలో సంబరాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సౌమ్య వెంకట్రాంరెడ్డి, రాజేశ్వర్, ఆంజనేయులు, వెంకటేశ్, మహిపాల్, వెంకట్‌రెడ్డి, శ్రీను, రాఘవేందర్‌రెడ్డి, రాజు, సంతోష్, రమేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

పూడూరు, జనవరి 5: 'నేను సైతం యువకుల కోసం' అనే కార్యక్రమంతో యువకులను చైతన్య పరిచిన నేషనల్ బెస్ట్ సొసైటీ అవార్డు గ్రహిత పెంటయ్యను శుక్రవారం అధికారులు సన్మానించారు. మండలంలోని రాకంచెర్ల గ్రామానికి చెందిన పెంటయ్యను స్థానిక పాఠశాల ఆవరణలో పంచాయతీ కార్యదర్శి గోవింద్ అధ్యక్షతన మండల అధికారులు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రికి మళ్లీ తాళం


ఆస్పత్రి ఎదుట నిరీక్షిస్తున్న రోగులు, సిబ్బంది

మేడ్చల్ టౌన్, జనవరి 5: మేడ్చల్ పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రికి భవనం యజమాని శుక్రవారం మరోసారి తాళం వేశాడు. అద్దెచెల్లింపు విషయంలో గత నెలలో దాదాపు 20రోజుల పాటు ఆసుపత్రి భవనానికి తాళం వేసిన విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకు రావటంతో స్థానిక నాయకులు, పోలీసులు జోక్యం చేసుకుని భవనం యజమానితో మాట్లాడి ఆసుపత్రి సేవలు ప్రారంభించారు. కాగా ఇంటి యజమాని తనకు ఇచ్చిన మాట ప్రకారం అద్దె చెల్లింపు విషయంలో ఈఎస్ఐ ఆసుపత్రి వారు అద్దె చెల్లించే విషయంలో మాట తప్పారంటూ శుక్రవారం ఉదయం తిరిగి ఆసుపత్రి ద్వారాలకు తాళం వేసి వెళ్లాడు. ఫలితంగా విధులకు వచ్చిన సిబ్బంది, చికిత్స కోసం వచ్చిన రోగులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆసుపత్రి ముందు పడిగాపులు కాయాల్సివచ్చింది. తాళం తీయాలని సిబ్బంది భవన యజమానిని కోరినా ససేమిరా అనడంతో విషయాన్ని ఉన్నత అధికారులకు తెలయజేశారు. సిబ్బంది ఆసుపత్రి ముందు అరుగులపై సమయం గడిపి ఇళ్లకు వెళ్లిపోయారు. అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్న ఆసుపత్రి కారణంగా తమకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు రోగులు ఆరోపించారు. ప్రతీరోజు బీపీ, షుగర్, ఇతర మందుల కోసం వందల సంఖ్యలో రోగులు వస్తుంటారని ఇలాంటి పరిస్థితుల్లో ఆసుపత్రి మూత పడితే తమ పరిస్థితి ఏంటని ప్రజలు వాపోతున్నారు. ఈఎస్ఐ ఆసుపత్రి ఎదుర్కొంటున్న అద్దె భవనం సమస్యను ఉన్నత అధికారులు వెంటనే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు అంతరిక్ష విజ్ఞాన సదస్సు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వికారాబాద్, జనవరి 5: వికారాబాద్ ధన్నారం సమీపంలోని యజ్ఞ సంస్థ ఆధ్వర్యంలో 7వ జాతీయ యువజన దినోత్సవాల్లో భాగంగా స్వామి వివేకానంద జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం(నేడు) స్పేస్ సైన్స్ కాంగ్రెస్ అంతరిక్ష విజ్ఞాన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం వరకు సత్యభారతి ఫంక్షన్‌హాల్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్వామి వివేకానంద పాఠశాలలో విశ్వశాంతి కోసం శుక్రవారం స్వామి వివేకానంద జీవితం సందేశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. దేశంలో అంతరిక్ష విజ్ఞానంలో సాధించిన చంద్రయాన్ 3, ఆదిత్య ఎల్ 1, సోలార్ మిషన్ వంటి గొప్ప విజయాలను పురస్కరించుకొని గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థిని విద్యార్థులకు అంతరిక్ష పరిజ్ఞానంపై ప్రోత్సాహం, ఉత్సుకత పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరు కానున్నారని వారు తెలిపారు.

ఆటోడ్రైవర్ల మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూనియన్ నేతలు

మేడ్చల్ టౌన్, జనవరి 5: మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని నిరసిస్తూ ఈనెల 7వ తేదీన ఆటోడ్రైవర్ల అసోసియేసన్ వారు నగరంలోని ఇందిరా పార్కు వద్ద నిర్వహిస్తున్న మహాధర్నా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం మేడ్చల్‌లో యూనియన్ నాయకులు ప్రారంభించారు. ధర్నాను ఆటోడ్రైవర్లు విజయవంతం చేయాలని కోరారు.

ఆర్టీసీ కార్మికుల వన భోజనాలు


వన భోజనాలు చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

మేడ్చల్ టౌన్, జనవరి 5: మేడ్చల్ ఆర్టీసీ డిపోకు చెందిన కార్మికులు శుక్రవారం వనభోజనాలు చేశారు. కార్మికుల మధ్య ఐక్యతను పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని డిపో మేనేజర్ సుధాకర్ అన్నారు.

స్పీకర్‌ను కలిసిన చెంగోల్ సర్పంచ్, ఈవో

తాండూరు రూరల్, జనవరి 5: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను తాండూరు మండలం చెంగోల్ సర్పంచ్ మల్లీశ్వరిగౌడ్, తాండూరు భద్రేశ్వర దేవాలయం ఈవో శేఖర్‌గౌడ్ దంపత


స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసి సన్మానిస్తున్న చెంగోల్ సర్పంచ్, ఈవో

ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభం


బస్సును ప్రారంభిస్తున్న సుధాకర్‌రెడ్డి, మంజుల రమేష్

వికారాబాద్, జనవరి 5: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే ప్రతి డిపోకు ఒక ఎక్స్‌ప్రెస్ బస్సు ఇవ్వడం శుభపరిణామమని వికారాబాద్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ డిపోలో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఎక్స్‌ప్రెస్ బస్సును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డిపో మేనేజర్‌తో పాటు మున్సిపల్ చైర్మన్ మంజుల రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు రత్నారెడ్డి, కిషన్‌నాయక్, వెంకట్ రెడ్డి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రమేష్ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 5: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండ చూడాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలోని చివరిగ్రామాలకు సైతం సరిపోను నీరు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎదులాబాద్ సర్పంచ్ కాలేరు సురేష్, మిషన్ భగీరథ అధికారులు డీఈలు మహేందర్, అర్చన, ఏఈ హరిణి, శామ్యుల్, సింగిల్‌విండో డైరెక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **కొడంగల్:** నిరుపేద ప్రజలను సేవా కార్యక్రమాలతో ఆదుకోవడం అదృష్టంగా భావించాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక కేఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన క్లబ్ నూతన సభ్యులకు నియామక పత్రాలు అందజేంచారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు వెంకట్‌రెడ్డి దేశ్‌ముఖ్, దానప్పయాదవ్, భాస్కర్, శ్రీకిషన్‌రావు, మురారి వశిష్ట, జయతీర్థచారి, డాక్టర్ సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

● **పూడూరు:** పరిగిలోని న్యామత్‌నగర్‌లో నేటి(శనివారం) నుంచి ఈనెల 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఇస్తేమా కార్యక్రమానికి వచ్చే ముస్లింలకు మండలంలోని కేరవెల్లి గ్రామ ముస్లింలు వారి సొంత డబ్బులు వెచ్చించి నీటి బాటళ్లను ఉచితంగా అందిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు వారిని అభినందించారు.

● **కొడంగల్:** ఈనెల 7న కొడంగల్ పట్టణంలోని ప్రాచ్య కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు భువనగిరి డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ టి.మల్లారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొడంగల్ ఓరియంటల్ కళాశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులు వివిధ ఉద్యోగాలు, పలు రంగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. వారందరితో కలిసి ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొడంగల్ వేంకటేశ్వర స్వామి ఆలయ కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆచార్యులు శ్రీమాన్ దరూరి శ్రీనివాసచార్యులకు గురు పూజోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులు, ఆత్మీయులు హాజరు కావాలని కోరారు.

● **నవాబుపేట:** హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నవాబుపేట మండలానికి చెందిన నాయకులు పాల్గొన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు కందాడ నాగిరెడ్డి, రాంరెడ్డి, రంగారెడ్డి, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

● **వికారాబాద్:** రాష్ట్ర స్థాయిలో జరిగే కబడ్డీ పోటీలకు జిల్లా జూనియర్ బాల బాలికల జట్టు ఎంపికలు నిర్వహించుటకు వికారాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.పరశురామ్ నాయక్ , ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు . జనవరి 7వ తేదీన జిల్లా జూనియర్ బాల బాలికల జట్టు కొరకు కుల్కచర్లలోని కేవీఎం స్కూల్ మైదానంలో ఉదయం 9 గంటలకు ఎంపికలు నిర్వహించడం జరుగుతుంన్నారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఫిబ్రవరి 5 తరువాత జన్మించి ఉండాలన్నారు. బాలురు 70 కిలోలు, బాలికలు 65 కిలోల లోపు ఉండాలని, క్రీడాకారులు పదో తరగతి ధృవీకరణ పత్రంతో పాటు ఆధార్ కార్డుతో వ్యయమ ఉపాధ్యాయుడు ఎన్. రాజేందర్ నాయక్‌ను చరవాణి 9959293604 సంప్రదించాలన్నారు.

● **తాండూరు రూరల్:** గురుకులాల విద్యాలయాల్లో 5వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులతో నేటితో గడువు ముగియనుందని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల ప్రాంతీయ సమన్వయకర్త పీఎస్ కళ్యాణి కొడంగల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆన్‌లైన్‌లో htttp://tgtwgurukulam.telnangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 11న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.